నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయండి

రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి

సత్తుపల్లి టౌన్/వేంసూరు, ఫిబ్రవరి 11: కృష్ణానదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ మంగళవారం నల్గొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నల్గొండలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

'సాగుప్రాజెక్టుల విషయమై సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు'

ప్రకటనలో ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఫిబ్రవరి 11: సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించింది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సాగు జలాల్లో వచ్చే వాటా కోసం తెలంగాణ తెచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కృష్ణాపై సాగు ప్రాజెక్టలను కేఆర్ఎంబీకి అప్పగించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే కృష్ణాజలాలు కృష్ణార్పణమయ్యాయని అభిప్రాయపడ్డారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల నిర్వహణ హక్కుల అప్పగింపు ముున్ముందు తెలంగాణ రైతుల జీవన్మరణ సమస్యగా పరిణమిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీన వైఖరితోనే ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. కాబట్టి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు బేషరుతుగా క్షమాపణలు చెప్పాలన్నారు.

పంటల సాయం జాడేది?

- వరి పంట పొట్ట దశకొచ్చినా అందని 'రైతుబంధు'
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- రెండు నెలల్లో మూడు ఎకరాల్లోపు రైతులకే సొమ్ము
- అది కూడా ఎకరానికి రూ.5 వేలు మాత్రమే..
- గణనీయంగా తగ్గిన యాసంగి సాగు విస్తీర్ణం

ఖమ్మం, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటినా రైతుబంధు జాడ కానరావడం లేదు. యాసంగి వరి పంట పొట్ట దశకొచ్చినా అన్నదాతలకు పంటల పెట్టుబడిసాయం పూర్తిస్థాయిలో అందలేదు. గడిచిన 60 రోజుల్లో కేవలం మూడు ఎకరాల్లోపు వ్యవసాయ భూమికి ఉన్న రైతులకు మాత్రమే సాయం అందింది. అది కూడా పాత విధానం ప్రకారం రూ.5 వేల చొప్పున మాత్రమే జమ చేసింది. ఫలితంగా అన్నదాతలంరూ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఈ యాసంగిలో సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గింది.

రూ.7,500 కాదు.. రూ.5 వేలే..

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా పథకం కింద పంటల పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.15,000కు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా ఆ పథకంపైనా, ఆ హామీపైనా స్పందించలేదు. ఈ యాసంగిలో పాత పద్ధతిలో ఎకరానికి రూ.5,000 ప్రకారం జిల్లాలో 3,42,803 మంది రైతుల ఖాతాల్లో రూ.370.30 కోట్లను జమ చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకూ 3 ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న 2,58,286 మంది రైతులకు అదే రూ.5,000 వేల చొప్పున రూ.162.48 కోట్లను మాత్రమే జమ చేశారు. దీంతో మిగిలిన రైతులకు రైతుబంధు సాయం అందే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రభావం సాగు విస్తీర్ణంపై కూడా పడింది. పంటల సాగు గణనీయంగా తగ్గింది. కొందరు రైతులు మాత్రం రైతుబంధు సాయం కోసం చూసీచూసీ నిరాశ చెందారు. పాత విధానం ప్రకారం వడ్డీ వ్యాపారులను, కమీషన్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఇంకా రైతుబంధు అందని రైతులు సుమారు లక్ష మంది ఉన్నారు. వారికి మరో రూ.200 కోట్ల వరకూ పంటల పెట్టుబడి సాయం అందాల్సి ఉంది.

సాగు విస్తీర్ణంపై తీవ్ర ప్రభావం..

సకాలంలో పంటల పెట్టుబడి సాయం చేతికి అందకపోవడంతో ఆ ప్రభావం యాసంగి సాగుపై తీవ్రంగా కన్పిస్తోంది. సాధారణంగా ఏటా యాసంగిలో వరి, మక్క సహా ఇతర పంటలను కలిపి సుమారుగా 3 లక్షల ఎకరాల్లో జిల్లా రైతులు సాగు చేస్తుంటారు. 2019–20లో 3.02 లక్షల ఎకరాలు, 2020–21లో 3.37 లక్షల ఎకరాలు, 2021–22లో 2.11 లక్షల ఎకరాలు, 2022–23లో 3.15 లక్షల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. అయితే 2023–24 సంవత్సరానికి గాను కేవలం 1,56,406 ఎకరాల్లో మాత్రమే రైతులు వివిధ పంటలను సాగుచేస్తున్నారు. వీటిలో వరి 85 వేల ఎకరాలు, మక్క 60 వేల ఎకరాల్లో సాగవుతోంది.

తోడైన సాగునీటి ఎద్దడి..

సాగు విస్తీర్ణం తగ్గుదలకు సమయానికి రైతుబంధు సాయం అందకపోవడంతోపాటు సాగునీటి ఎద్దడి కూడా తోడైంది. జిల్లాలో మొత్తం 21 మండలాలుండగా వీటిలో 16 మండలాలు నాగార్జునసాగర్ ఆయకట్టు కిందకు వస్తాయి. ఆయకట్టు రైతులందరూ రెండు సీజన్లలోనూ ఈ నీటి మీదనే ఆధారపడతారు. సుమారు 1.50 లక్షల ఎకరాలను సాగు చేస్తారు. అయితే ప్రస్తుతం నాగార్జున సాగర్ ప్రాజెక్టును ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడంతో అక్కడి నుంచి కూడా సాగునీరు అందించే పరిస్థితి లేకుండా పోయింది.

గడిచిన ఐదేళ్లలో అందిన రైతుబంధు సాయం ఇలా..

సంవత్సరం	పంట సీజన్	రైతుల సంఖ్య	జమ అయిన సొమ్ము
2018–19	యాసంగి	2,74,920	రూ.255.14 కోట్లు
2019–20	యాసంగి	2,69,140	రూ.185.15 కోట్లు
2020–21	యాసంగి	2,99,307	రూ.357.84 కోట్లు
2021–22	యాసంగి	3,08,400	రూ.328.96 కోట్లు
2022–23	యాసంగి	3,12,250	రూ.332.85 కోట్లు
2023–24	యాసంగి	3,42,503	రూ.162.48 కోట్లు (నేటి వరకు)

భద్రాద్రి జిల్లాలో పరిస్థితి ఇలా...

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పేరుగొప్ప ఊరుదిబ్బ అన్నట్లుంది కాంగ్రెస్ సర్కారు పాలన. కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటినా రైతుబంధు జాడ కానరావడం లేదు. యాసంగి వరి పంట పొట్ట దశకొచ్చినా అన్నదాతలకు పంటల పెట్టుబడిసాయం పూర్తిస్థాయిలో అందలేదు. గడిచిన 60 రోజుల్లో కేవలం మూడు ఎకరాల్లోపు వ్యవసాయ భూమికి ఉన్న రైతులకు మాత్రమే సాయం అందింది. అది కూడా పాత విధానం ప్రకారం రూ.5 వేల చొప్పున మాత్రమే జమ చేసింది. ఫలితంగా అన్నదాతలంరూ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఈ యాసంగిలో సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా పథకం కింద పంటల పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.15,000కు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా ఆ పథకంపైనా, ఆ హామీపైనా స్పందించలేదు. జిల్లావ్యాప్తంగా 1,78,541 మంది రైతులు ఉండగా ఇప్పటివరకు 1,28,520 మంది ఖాతాల్లో మాత్రమే రైతుబంధు జమ అయింది. రైతుల ఖాతాల్లో రూ.269 కోట్లు జమ కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.121 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. అది కూడా కేవలం రెండు నుంచి మూడు ఎకరాలున్న వారికి మాత్రమే. ఐదు ఎకరాలకు పైగా అంతకు మించి భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందనేలేదు. దీంతో వారంతా పంట పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

మళ్లీ అప్పు చేయాల్సిందే..

కేసీఆర్ ప్రభుత్వం సీజన్‌కు ముందే రైతుబంధు ఇచ్చేది. సరైన సమయంలో పెట్టుబడి సాయం అందడంతో రైతులకు ఇబ్బందులు ఉండేవి కాదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అదును దాటినా సాయం అందలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుబంధు అందజేయాలి. నేను వడ్డీకి రూ.20 వేలు అప్పు తెచ్చి పంట ఖర్చులకు వాడుతున్నాను.

– బోడా లకుపతి, రైతు, రుద్రంపూర్, చుంచుపల్లి మండలం

అసలుకే మోసం అవుతుందేమో..

కేసీఆర్ ప్రభుత్వంలో ఏనాడూ రైతుబంధు ఆలస్యం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పంట సీజన్ వెళ్లిపోతున్నా రైతులకు సాయం అందించడం లేదు. నాకు ఐదు ఎకరాలు పొలం ఉంది. రైతుబంధు చేతికి వస్తుందని నేను సాగు ప్రారంభించాను. కానీ సాయం అందలేదు. సాయం ఇవ్వలేమని ముందే ప్రభుత్వం చెప్తే నాకు చేతనైనంతలో సాగు చేసేవాడిని. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తే మంచి జరుగుతుంది. లేదంటే రైతులు ఆగమైపోతరు. అసలుకే మోసం వచ్చి రైతు దివాలా తీస్తాడు.

– అజ్మీరా శ్రీను, రైతు. సీతంపేట బంజర, సుజాతనగర్ మండలం

కేసీఆర్ ప్రభుత్వం ఠంచనుగా సాయం అందించేది..

ఒక్క కేసీఆర్ ప్రభుత్వమే రైతులకు మేలు చేసింది. ప్రతిసారి సీజన్‌కు ముందే రైతుబంధు అందేది. ఆ సొమ్ముతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనేవాళ్లు. దీంతో సాగు సాఫీగా జరిగేది. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వలేదు. మళ్లీ పాత రోజులే వచ్చినట్లు అనిపిస్తున్నది. రైతులు మళ్లీ మిత్తి వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. వడ్డీకి అప్పులు తెచ్చుకుంటున్నారు. ఇట్లా అయితే రైతు ఏం వ్యవసాయం చేస్తాడు? ఏం పంటలు పండిస్తాడు ?

– పొడియం సుబ్బారావు, రైతు రామారావు పేట, దుమ్ముగూడెం మండలం

రైతుబంధును కొనసాగించాల్సిందే..

కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇచ్చేది. సొమ్ము సకాలంలో అందడంతో రైతుల అవసరాలు వెంటనే తీరేవి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తున్నది. పంట సీజన్ అయిపోతున్నా చేతికి పైసలు ఇవ్వకపోతే రైతులు ఎట్లా సాగు చేస్తరు. పెట్టుబడికి ఎక్కడి నుంచి డబ్బులు తీసుకొస్తరు.

– భూపతి రమేష్, రైతు, రావికంపాడు, చంద్రుగొండ మండలం

అప్పులు చేయాల్సిన పరిస్థితి..

కేసీఆర్ ప్రభుత్వంలో పంట పెట్టుబడి సాయం అదునుకు ముందే రైతుబంధు అందేది. ఏడాదిలో రెండుసార్లు ఎకరానికి రూ.5 వేల చొప్పున జమ అయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజులైనా రైతుబంధు సొమ్ము అందలేదు. రైతులు పంట పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– దేశిరెడ్డి నాగిరెడ్డి, రైతు, రేజర్ల, సత్తుపల్లి మండలం

రైతుబంధు అందక ఇబ్బందులు

రైతుబంధు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏటా రెండు విడతలుగా రైతుబంధు అందేది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సాగు కాలం దాటిపోతున్నా పైసలు జమ చేయలేదు. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రైతులు సొమ్ము తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాకున్న ఆరు ఎకరాలకు రైతుబంధు అందాల్సి ఉన్నది.

– చిర్రా కృష్ణయ్య, రైతు, తెట్టెలపాడు, తిరుమలాయపాలెం మండలం

నాడు సంతోషంగా వ్యవసాయం

కేసీఆర్ ప్రభుత్వం ఏటా సీజన్‌కు ముందే రైతబంధు సొమ్ము అందేది. రైతులు దర్జాగా, సంతోషంగా వ్యవసాయం చేసుకోనేటోళ్లం. నాడు నేను సకాలంలో పంటలను వేసుకునేవాడిని. పంట పెట్టుబడి కోసం ఇతరుల మీద ఆధారపడే అవసరం ఉండేది కాదు. నాకు 4.2 ఎకరాల భూమి ఉన్నది. నాకు బొబ్బర్లు, మినుములు, పెసర్లు సాగు చేయాలని ఉంది. కానీ చేతిలో సొమ్ము లేదు. ఏం చేయాలో తెలియడంలేదు. రాష్ట్రప్రభుత్వం వెంటనే రైతుబంధు డబ్బులను విడుదల చేయాలి.

– ఆజ్మీరా భావ్‌సింగ్, రైతు, రొంపేడు, ఇల్లెందు మండలం

రైతుల్లో ఆందోళన..

నాకు ఆరు ఎకరాల భూమి ఉంది. దానిలో నేను వరి పండిస్తున్నాను. రాష్ట్రప్రభుత్వం ఈ సీజన్‌లో కేవలం రెండు మూడు ఎకరాలలోపు ఉన్న రైతుల ఖాతాల్లో మాత్రమే సొమ్ము జమ చేసింది. అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు అన్యాయమే జరిగింది. రైతుబంధు సొమ్ము అందక వేలాది మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. సొమ్ము అందదేమోనని, అప్పులు తీసుకురావాలేమోనని ఆందోళన చెందుతున్నారు.

– మందడపు అశోక్‌కుమార్, రైతు, లంకాసాగర్, పెనుబల్లి మండలం

చేతిల పైసలు లేవు..

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతులకు మంచి జరుగుద్ది అనుకున్నాం. కనీసం అదునుకు రైతుబంధు ఇస్తది అనుకున్నాం. కానీ మా ఆశలు అడియాశలు అయ్యాయి. చేతిల పైసలు లేకుండా వ్యవసాయం ఎట్ల చేయాలె. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రైతుల పరిస్థితి మంచిగుండె. టయానికి సొమ్ము అందేది. ఎరువులు, విత్తనాలు.. ఇలా ఏవంటే అవి వెంటనే కొనుక్కునేటోళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకుంటలేదు. పంట సాయం ఇయ్యకుంటే రైతులు ఆగమైతరు.

– పసుపులేటి వెంకయ్య, రైతు, సున్నంబట్టి, దుమ్ముగూడెం మండలం

కేసీఆర్ ప్రభుత్వంలో సాగు పండుగ..

కేసీఆర్ ప్రభుత్వంలో సాగు పండుగ. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాత్రం సాగు దండగ అనిపిస్తున్నది. అదును దాటిపోతున్నా కొందరు రైతులకు మాత్రమే సొమ్ము ఇచ్చింది. మిగిలిన రైతులకు చిల్లి గవ్వ కూడా ఇవ్వలేక పోయింది. రైతుబంధు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించకోకపోవడం బాధాకరం. ఎరువులు, కూలీల ఖర్చులకు రైతులు ఎక్కడి నుంచి సొమ్ము తేవాలి? ఎలా సాగు చేయాలి?

– గడ్డం శ్రీనివాసరావు, రైతు, నాగిలిగొండ, చింతకాని మండలం

కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు..

ఆరు నూరైనా రైతుబంధు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఆ మాటను నిలబెట్టుకోలేకపోయింది. అధికారాన్ని చేపట్టి రెండు నెలలైనా రైతుబంధు అందరికీ ఇవ్వలేదు. సొమ్ము అందిన వాళ్లు సాగు చేసుకుంటున్నారు. మిగతా వాళ్లు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

– వాలూరి దామోదర్, రైతు, తాళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

స్త్రీలపై ట్రోలింగ్‌పై కలిసికట్టుగా ఉద్యమించాలి

ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక (ప్ర.ర.వే) ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరి

మాట్లాడుతున్న ప్ర.ర.వే ప్రధాన కార్యదర్శి, రచయిత్రి మల్లీశ్వరి, హాజరైన రచయిత్రులు

ఖమ్మం, ఫిబ్రవరి 11: స్త్రీలపై ట్రోలింగ్‌పై ప్రజాస్వామికవాదులు, లౌకికవాద శక్తులంతా ఒక్కటై ఉద్యమించాలని ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక (ప్ర.ర.వే) ప్రధాన కార్యదర్శి, రచయిత్రి మల్లీశ్వరి పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని వేదిక కల్యాణ మండపంలో ప్ర.ర.వే ఏడో మహాసభల్లో భాగంగా రెండోరోజు ఆదివారం 'స్త్రీలపై ట్రోలింగ్' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలో ప్రస్తుత పరిణామాలను గమనిస్తూ, వాటిని విశ్లేషిస్తూ ప్ర.ర.వే అక్షరబద్ధం చేస్తున్నదన్నారు. తమ రచనలు కూడా సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్‌కు గురయ్యాయన్నారు. సోషలిస్ట్ భావాలు ఉన్న వారు కూడా స్త్రీలను ట్రోలింగ్ చేయడం దారుణమన్నారు. వాస్తవాలను మాట్లాడే వారిని మత ఛాందసవాదులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. వాస్తవాలను మాట్లాడే వారిని కొందరు పనిగట్టుకుని మరీ ట్రోలింగ్ చేస్తున్నారన్నారు. వాటన్నింటినీ తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాగాయని విమలక్క మాట్లాడుతూ.. ట్రోలింగ్‌ను ఎదుర్కోవాలంటే ప్రజాస్వామిక వాదలందరూ ఒక్కటవ్వాలన్నారు. సరికొత్త ఉద్యమాలకు నాంది పలకాలన్నారు. అనంతరం ప్ర.ర.వే జాతీయ కోశాధికారి రామలక్ష్మి సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. తర్వాత రచయత్రి కాత్యాయనీ విద్మహే రచించిన నవలను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత్రులు శిలాలోలిత, శీలా సుభద్రాదేవి, ఎండ్లూరి మానస తులసి చందు, మెర్సీ మార్గరెట్, స్వేచ్ఛ , అరుణ గోగులమండ. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్, యాంకర్ ఉదయభాను, హేతువాది బైరి నరేష్ పాల్గొన్నారు.

సినీనటుడు వేణుకు సండ్ర పరామర్శ

సినీనటుడు వేణును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 11: ప్రముఖ సినీనటుడు తొట్టెంపూడి వేణు తండ్రి తొట్టెంపూడి వెంకటసుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హైదరాబాద్ లోని ఆయన నివాసానికి ఆదివారం వెళ్లి పరామర్శించారు. తొలుత వెంకటసుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా ఆంగ్ల బోధన చేయాలి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

సారపాక, ఫిబ్రవరి 11: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా ఆంగ్ల బోధన చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. ఆదివారం సారపాకలోని బీపీఎల్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ లెక్చరర్లతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌లో విద్యాబోధన, మాట్లాడుకునే విధానం, నైపుణ్యాల గురించి అర్థం చేసుకుని గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. వారానికి 20 మంది చొప్పున ఎంపిక చేసి నిష్ణాతులైన ఇంగ్లిష్ లెక్చరర్లతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని అన్నారు. ప్రతి ఆదివారం ఇంగ్లిష్ పాఠశాలలుగా కన్వర్ట్ చేసిన పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఆంగ్ల భాషపై మక్కువ కలిగేలా చేస్తామన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి తమవంతు బాధ్యతగా కృషిచేస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లను పీవో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో భద్రాచలం, ఖమ్మం ఏసీఎంవోలు రమణయ్య, నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రపంచ బ్యాంక్ కనుసన్నల్లో బడ్జెట్ల రూపకల్పన

అఖిల భారత విద్యాహక్కు వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11: ప్రస్తుత పాలకులు ప్రపంచ బ్యాంక్ కనుసన్నల్లో బడ్జెట్లు రూపొందిస్తున్నారని అఖిల భారత విద్యాహక్కు వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్ ఆరోపించారు. ఖమ్మం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల తొత్తుగా పనిచేస్తున్నదని మండిపడ్డారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుడే అంతిమ విధాన నిర్ణయకర్త అన్నారు. అన్ని వర్గాల పేదలకు సమానస్థాయిలో బోధన అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. కుల, మతాలకు అతీతంగా రేపటి పౌరులకు విద్య అందించాలన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు 'విద్యార్థులకు అంతరాలు లేని విద్య' అనే నినాదంతో టీపీటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తున్నదన్నారు. అనంతరం ప్రొఫెసర్ కాశీం, ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ ప్రసంగించారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ నాగిరెడ్డి, సభ్యులు మనోహర్‌రాజు, విజయ్ పాల్గొన్నారు.

జిల్లాలో సీఐల, ఎస్సైల బదిలీలు

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 11 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలను బదిలీ చేస్తూ ఆదివారం మల్టీ జోన్–1 ఐజీ తరుజోషీ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు, 13మంది ఎస్సైలకు స్థానచలనం, పోస్టింగులు కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మల్టీజోన్–1లో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న టి.సురేశ్ టేకులపల్లి సీఐగా, టేకులపల్లి సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆలేటి ఇంద్రసేనారెడ్డి కొత్తగూడెం రూరల్(జూలూరుపాడు) సీఐగా, జూలూరుపాడు సీఐగా విధులు నిర్వర్తిస్తున్న మల్లంపల్లి శ్రీనివాస్ జిల్లా వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న రాయల వెంకటేశ్వర్లు భద్రాచలం సీఐగా, భద్రాచలం సీఐగా ఉన్న నాగరాజు మల్టీజోన్–1 ఐజీ కార్యాలయానికి, ఎస్బీ–2లో ఉన్న ఆలెం రాజు వర్మను చర్ల సీఐగా, ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లిస్ట్‌లో ఉన్న సట్ల రాజుని ఎస్బీ–2 ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

13మంది ఎస్సైల బదిలీ : బూర్గంపహాడు ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఈ. రాజ్‌కుమార్ కొత్తగూడెం సీసీఎస్‌కు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కే. సుమన్ బూర్గంపాడు ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యింది. అదే విధంగా అశ్వారావుపేట ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న పి. శ్రీకాంత్ బోడు ఎస్‌హెచ్‌వోగా, బోడు ఎస్‌హెచ్‌గా ఉన్న రంజిత్ కొత్తగూడెం వీఆర్‌కు, ఇల్లెందు ఎస్సై–1గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.కే. సైదా రహూఫ్‌కు టేకులపల్లి ఎస్‌హెచ్‌వోగా, టేకులపల్లి ఎస్‌హెచ్‌వోగా ఉన్న జి. రమణారెడ్డికి మణుగూరు ఎస్సైగా, మణుగూరు ఎస్సై–1గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరాముల శ్రీనుకి అశ్వారావుపేట ఎస్‌హెచ్‌వోగా, వీఆర్‌లో ఉన్న సందీప్ కుమార్‌కు ఇల్లెందు ఎస్సైగా, కొత్తగూడెం వన్ టౌన్ ఎస్సై1గా విధులు నిర్వర్తించిన బి.శ్రీనివాస్‌కు పాల్వంచ రూరల్ ఎస్‌హెచ్‌వోగా, వీఆర్‌లో ఉన్న ఎం. రాజమౌళికి ముల్కలపల్లి ఎస్‌హెచ్‌వోగా, వీఆర్‌లో ఉన్న వెంకటప్పయ్యకు ఏడూళ్ల బయ్యారానికి, ఏడూళ్లబయ్యారం ఎస్‌హెచ్‌వోగా ఉన్న పఠాన్ నాగుల్ మీరాఖాన్‌కు కొత్తగూడెం వీఆర్‌కు, పాల్వంచ రూరల్ ఎస్‌హెచ్‌వోగా ఉన్న జె. కార్తీక్‌కును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.